కథానిక

# "శుభలేఖ"

"తిరునగర్"

పోస్టుమాన్ వచ్చి శుభలేఖ ఇచ్చిపోయాడు.

దశరథరామయ్య చదివి గబగబా ఇంట్లోకి వెళ్ళి భార్యను పిలిచాడు. ఆమె వంటఇంట్లో కూరలు తరుగుతూ ఏవేవో మంగళహారతులు వల్లెవేసుకొంటూ దశరథరామయ్యగారి మాట విన లేదు.

"ఏమేవ్! ఇంట్లో లేవా ఏం?" అప్పటికిగాని ఆమెకు తెలీలేదు భర్త తనని పిలుస్తున్నాడని.

"ఆఁ"అని పలికింది.

"ఇలారా ఒక్కసారి" అన్నాడు—ఆ చల్లని కబురు చెవిని వేదామని.

"ఎందుకూ?"

"ఓమాట వినిపోదూ గాని."

"చేతినిండా పనివుంది. మీకెప్పుడూ ఏవేవో మాటలొస్తాయి"అంది అక్కణ్ణించి లేవడం ఇష్టం లేక.

"అబ్బా త్వరగా రద్దూ. గంటసేపు ఉపోద్ఘాతమెందుకు!"అన్నాడు దశరథరామయ్య ఆదుర్దా కనపరుస్తూ. ఇక ఆమెకు తప్పలేదు. మోయలేనంత శరీరమాయె! లేవడమంటే మాటలేమీ గాదు. ఆ సంగతి దశరథరామయ్యకేం తెలుసు? తనకీ అంత వళ్ళుంటే తెలుసును చీటికీమాటికీ పిలుస్తూవుంటే కూర్చున్నచోటియుంచి లేవడానికి ఎంత కష్టపడాలో. లేచి వెళ్ళి "ఏమిటీ?"అంది వంటింటి గుమ్మందాటుతూను.

"పెళ్ళిటే" అన్నాడు దశరథరామయ్య విషయం ఏమీ చెప్పకుండా.

"ఎవరిదీ?"

"ఇంకెవరిది, వేణుదిటు."

దశరథరామయ్య భార్య చేటంత ముఖం చేసుకుని "నిజంగానే! వేణుపెళ్ళి ఏర్పాటయిందన్నమాట. ఆఁ! ఎప్పుడు లగ్నం?"అంది.

"వచ్చేగురువారంరోజునే- తెల్లవారుజామున అయిదున్నరగంటలకు మిథునలగ్నం."

సావిత్రమ్మ: "గురువారంరోజునేనా? అంత తొందర్లో పెట్టేశారే లగ్నాలు! మొన్న నేవెళ్ళినప్పుడే అంది కాంతమ్మ- కొడుక్కి త్వరలోనే పెళ్ళిచేసెయ్యాలనీ- సంబంధాలు వెతుకుతున్నారనీ."

"వేణు బి. ఏ. ప్యాసయినాడుగదూ? వుత్తరం గూడా వేసినట్లున్నారు మనకి."

"అవునండీ. మన అల్లుడితోనే ప్యాసయాడు."

"అయితే రామారావూ పెళ్ళికొస్తాడన్న మాటా?"

"భలేవారే మీరు. వాళ్ళిద్దరూ చిన్నప్పట్నుంచీ ప్రాణస్నేహితులు"అంది సావిత్రమ్మ భర్త ఆర్గ్యుమెంటును బలపరుస్తూను.

కట్నమెంతో?" అన్నారు దశరథరామయ్యగారు కొడుకుగల తండ్రిగనుక-

"ఎక్కువే వుంటుందిలెండి; ఓ చీరకొనండి పెళ్ళికి మకే వున్నచీరలేమీ బావుండలేదు" అంది సావిత్రిమ్మ.

"పెళ్ళికి నువ్వూ బయలుదేరుతావా ఏం?" అన్నాడు దశరథరామయ్య ఇంతసేపట్నుంచీ అలా అనుకోనట్లు.

"నేవెళ్ళాలి బాబూ మళ్ళా ఎప్పుడు వెళతానేమిటి?" అంది—గారాబు పిల్ల అన్నట్లు సావిత్రమ్మ.

"మొన్ననేగా నువ్వు వెళ్ళింది? అసలేడబ్బుకు ఇబ్బందిగావుంది. నే ఒక్కణ్ణే వెళితే చాలదా ఏం?"అన్నాడు దశరథరామయ్య.

"పాపం మా కాంతమ్మ పిన్నికి నేనంటే ఎంతో ప్రేమ. మొన్న నర్సుపెళ్ళికి గూడా వెళ్లలేదా! నేనుఇప్పుడూరాకపోతేఏమనుకుంటుంది?" అంది సావిత్రిమ్మ తనరాకకు కావలసినకారణాలు ఆర్గ్యుమెంటుగా చెపుతూ!

"అసలే డబ్బులేక చస్తూవుంటే ప్రతిదానికీ వెనకబయలుదేరతావు-నీ కళ్ళు ఎదుటే అలుడికి

వాచ కొనిపెట్టడానికీ-వాటికీ వీటికి రెండువందల రూపాయలయ్యాయా? ఇప్పుడీ అనవసరపు ఖర్చు యెందుకు చెప్పు?" అన్నాడు దశరథరామయ్య పాపం ఎలాగయినా ఒప్పిద్దామని. సావిత్రమ్మ మాత్రం మెదలకుండా ఊరుకో గూడదూ! "మీరెప్పుడూ అలాగే అంటూన్లెండి. మొన్న రాజమండ్రినుంచి సరస్వతి పెళ్ళికిరమ్మని ఉత్తరంవస్తే పంపుతా-పంపుతానని ఆఖరికి పట్టిడే చేశారు. ఇంతఖర్చు అవుతోవుంటే ఇక నా ఖర్చేగాబోలు మీకు భారం?" అంది.

"అడ్డం పెట్టుకోడానికి ఎన్నయినా దొరుకు తాయి. ఇంతకూ నీకు కావలసింది డబ్బు ఖర్చు గావటమే" అన్నాడు దశరథరామయ్య బెంచీ మీద కూర్చుని.

సావిత్రి వంటయిట్లో కూర పక్వాన్ని చూస్తూ "మనమంటే వాళ్ళకెంతఅభిమానం, ఎంతప్రేమో! మొన్న ఇక్కడికి వచ్చినప్పుడు గూడా కావి లించుకొని, "నీకోసమే అసలు వచ్చానే. నువ్వు పెళ్ళికి తప్పకుండా రావే" అని చెప్పిపోయింది. మీరేమో తీసికెళ్ళడానికి ఇదవుతారు."

ఈసారి దశరథరామయ్యను కోపం వచ్చింది, "నీ ఇష్టం వచ్చినట్లే చెయ్. చెపితే ఒకప్పుడు విన్నావు గనుకనా ఇప్పుడు వినడానికి? చదువు కునే పిల్లాడిని వదిలి బయలుదేరతానని కూర్చుం టివి" అని విసురుగా అంటూ, అటూ ఇటూ పచారుచేస్తున్నాడు.

"పోనీలెండి మీకంత కష్టంగావుంటే పెళ్ళికి రానేరాను. తీసికెళ్ళటం యిష్టం లేదనక పిల్లాణ్ణి అడ్డుపెడతారేమిటి? రెండురోజులు ఏ హోట లులో నయినా తింటాడు" అంది సావిత్రమ్మ.

"ఆ నింద నామీద మోపటమెందుకు? ఆ వెళ్ళేదేదో నువ్వే వెళ్లిరా!" అన్నాడు దశరథ రామయ్య.

"నేను చచ్చినా వెళ్ళను - మీకంత కష్ట మెందుకు?"

"మనిషిజన్మ ఎత్తినతరువాత సంసారంచేస్తున్న తరువాత బాధ్యతంటూ కాస్త గుర్తించాలి" ఇక ఎత్తుకున్నాడు ఉపన్యాసధోరణిలో.

సావిత్రమ్మ అప్పటితో మెదలకుండా వూరు కూర్చేసే గంగం అపలింతనగనూ వెళ్ళేదేగాదు "ఇవతల వాళ్ళే అంత తేలిగ్గావున్నారు. పాపం మీరు మాత్రం మొన్న మీస్నేహితుడికొడుకొస్తే సూటు కుట్టించారు. అది అనవసరంకాదూ?" అంది పాపం ఆ విషయం అప్పట్నుంచీ మనసులోనే వుంది గాబోలు. దశరథ రామయ్య ఉగ్రుడైపోయాడు. "అవునుమరి. నువ్వో పెద్ద ఆరిందావయిపోయా వులే! నా తప్పులు చూపించేటంతటి దానవయ్యా వీనాటికి?" అన్నారు కోపంగా.

"అయ్యో నేమాత్రం ఏమన్నాను? అది అన వసరం కాదా అన్నాను. అనుకుంటే ఏది అనవ సరం ఖర్చుగాదు?" సమర్థించింది చివరికి.

"అవునుమరి ఆదాచేసి ఇదంతా నేకట్టుకు పోదామని" అని ఉక్రోషంగా దశరథరామయ్య. ఈవిధంగా వివాహ శుభకార్యం, భార్యా, భర్తల మధ్య దుమారం చెలరేగ జేసింది. ఇది ఎంతదూరం పోయిందంటే, ఇంటి యజమాని భోజనం మానివేసి బిర్రబిగుసుకొని పండుకొనే వరకూచు. సావిత్రి భోజనం చెయ్యలేదు. రాత్రి పదిగంటలకి భర్తను భోజనానికి లేపింది. ఆయన మరీ బిర్రబిగిసి ససేమిరా లేవలేదు. ఆ రాత్రి సావిత్రమ్మ సహితం ఉపోషమే!

తెల్లవారేక గూడా వాతావరణం ఏమీ మారలేదు. ఎవరి పట్టుదలమీద వాళ్లున్నారు. మామూలుగా లేచి దశరథరామయ్య బజారు వెళ్ళి వచ్చి పేపరు చూస్తూ కూర్చున్నాడు.

వరండాలో కూర్చుని పడకకుర్చీలో పేపరు చదువుకొంటూ వుండగా పోస్టువాడొచ్చి ఓ ఉత్తరం ఇచ్చిపోయాడు.

మహారాజశ్రీ మామగారికి మీ అల్లుడు నమస్క రించి వ్రాయునదేమనగా, మీ అమ్మాయి జానకి నిన్న మధ్యాహ్నము మరణించినది. మీరేమియు విచారించవద్దు. మీ క్షేమ సమాచారములతో ఉత్తరము వ్రాయవలయును. ఇంతే సంగతులు చిత్తగించవలెను. ఇట్లు,

మీ అల్లుడు రామారావు.

ఈ ఉత్తరం చదివి నుంచున్నవాడు అలానే స్థంభించిపోయాడు దశగథరామయ్య. చేతులో వున్న పేపరు అక్కడ పారవేసి బింగారుగా ఇంట్లోకి వెళ్ళి "ఏమేవ్! ఇలారా కొంప మునిగింది" అని కేకవేశాడు సావిత్రమ్మని.

సావిత్రమ్మగారు మొదట కొన్ని క్షణాలు తమాయించుకొని వూరుకొందిగాని భర్త పిలుపులో క్రొత్తదనం కనిపెట్టి గబగబా వచ్చి "ఏమిటండీ" అంది ఆత్రంగా!

దశరథరామయ్య చెప్పే స్థితిలో లేడు. ముఖమంతా ఎర్రబడి చూడ్డానికి భయంకరంగావుంది. సావిత్రమ్మ మరింత ఖంగారుపడి, ఏమిటండీ! ఏమయింది?" అంది.

"ఏమవటమేమిటి? జానకి..." మాట రావడంలేదు. సావిత్రమ్మకీ గొంతులో గాద్గదిక మేర్పడిపోయింది. "ఏమిటండీ జానకికి ఏమైంది? నాతల్లికి ఏమయిందండీ! త్వరగాచెప్పండీ?"అంది.

"నిన్న మధ్యాహ్నమే పోయిందట."

సావిత్రమ్మ హఠాత్తుగా చావు కబురు విని నిలబడ్డ మనిషిని నిలబడ్డట్లే క్రింద పడిపోయింది. దశరథరామయ్యే భార్యను లేవనెత్తి ముఖంమీద నీళ్లు చల్లి సేదతీర్చాడు. స్పృహవచ్చాక భర్తను కౌగలించుకొని ఏడ్వడం మొదలుపెట్టింది సావిత్రమ్మ. దంపతులమధ్య నిన్నటి నించీ జరిగిన వాదవివాదాల స్పర్థ ఆ సమయంలో ఎక్కడా కనిపించనే లేదు. ఆ విషాద సమయంలో మిగిలింది పరస్పర ప్రేమాభిమానాలు తప్ప వేరేమీ లేవు. కన్న కూతురి మరణవార్త విని కన్నకడుపులు రెండూ తక్కిన విషయాలన్నీ విస్మరించి ఏకమై ఏడ్వడం మొదలుపెట్టారు.

సావిత్రమ్మ ఏడుస్తూనే "ఉత్తరం ఎప్పుడొచ్చింది? ఏమని రాశాడు?" అంది.

"ఇప్పుడే! అసలు అతగాడు, మొన్న నెప్పుడో చనిపోతే ఉత్తరం వ్రాసి వూరుకున్నాడేవిటి? టెలిగ్రామన్నా ఇవ్వకుండాను?" అన్నాడు దశరథరామయ్య.

దశరథరామయ్యకు కడుపులో మండిపోతోంది అల్లుడిమీద. ఎంత నిర్లిప్తత? మీకూతురు చనిపోయింది. విచారించవద్దుట!"

"నే మొదట ఈ సంబంధానికి ఒప్పుకోనే లేదు.. ఆ చదువూ - ఆస్థి చూచి నువ్వే మోసపోయావు-ఇప్పుడు ఏడుపు-?"అన్నాడు. కూతురిమీదవున్న ప్రేమనంతా అల్లుడిపైనకోపంగామార్చి. సావిత్రమ్మ ముక్కుచీదివేసి "కూతురు చచ్చిఏడుస్తూవుంటే ఏమిటీమీసాధింపులు!"అని విసుక్కుంది.

ప్రక్కఇంట్లో ఏడుపూ పెడబొబ్బలూ వింటూ ఎవరుమాత్రం మెదలకుండా వుంటారు? కొద్దిసేపట్లోనే ఇల్లంతా ఇరుగు పొరుగు అక్కలమ్మలతో నిండిపోయింది. "ఏమిటేమిటని"ప్రశ్నించే వాళ్ళే అందరూను! సావిత్రమ్మ అంతఏడుపులోనూ కూతురి హఠాన్మరణాన్ని అందరికీచెప్పి మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది! వచ్చినవాళ్లంతా ముక్కుమీద వ్రేలువేసుకొని" ఇక్కణ్ణించివెళ్ళి నెలరోజులన్నా కాలేదు! ఎలా చనిపోయింది? ఇంతకూ జబ్బేవిటి?" అన్నారు నెలరోజుల్లో మనిషి చావడానికి అవకాశం లేనట్లు.

"ఏమో? జబ్బు ఎవరికితెలుసు?"

"ఇంతకూ ఎప్పుడు చచ్చిపోయినట్లు?" అంది ఓ లావాటావిడ. దశరథరామయ్య క్రిందకి చూస్తూ"ఆదివారం మధ్యాహ్నమేట!"అన్నాడు.

ఇంకొకామె అందుకుంది "ఇవ్వాళ తెలిసిందా మీకు?" అని.

"అవునమ్మా" అంది పెద్దగా ఏడుస్తున్న ఏడుపులోంచే సావిత్రమ్మ.

"మరీవిడ్డూరంగా వుందివిన్నీ! మూడురోజులనాడు పోతే తలిదండ్రులకి చూపైనా అందకుండా ఇప్పుడు ఉత్తరం రాస్తారా?" అంది బుగ్గమీద వేలేసుకొని ఓ ప్రౌఢ!

ఇంతలో ప్రక్కయింటి అరుంధతి "అబ్బే మీరలా ఖంగారు పడకండి. నేను మొన్ననేగా బెజవాడనించివస్తా! వచ్చేటప్పుడు జానకిదగ్గరికి గూడా వెళ్ళొచ్చాను. అప్పటికి జానకికి ఏమీ లేదు. బాగానేవుందే!" అంది.

"ఏమోనమ్మో! నాకూతురు అత్తమాటలు పడలేక ఏమయ్యిందో చూచుకుందేమో! కూతురో ఏనాడూ ఎవ్వరిచేతా-ఒక్కమాటన్నా పడేది గాదు. కూతురో!" అంటూ దీర్ఘాలు మొదలు పెట్టింది సావిత్రమ్మగారు.

తల్లిదండ్రులు దుఃఖంచూచి అక్కడున్న అందరిహృదయాలూ కరిగిపోయి కన్నీళ్లు కార్చనివారులేరు!

"పాపం! ఎంత చిన్నవయస్సు" అని ఒకరు.

"ఏమైతేనేమి? మృత్యువురాసివుంటే ఎవ్వరూ తప్పించలేరు" అంది ఒకామె.

"అయినా అలుడికి అదేంపొగరమ్మా? కూతుర

చచ్చిపోతే ఎలాగయినా కన్నకడుపుగదా! అలా కార్డుముక్క రాసుకుంటారా?" అని వాపోయిందింకో కావిడ.

"ఏముందే అమ్మాయీ. చచ్చిపోయాక వీళ్లు వెళ్ళితేమాత్రం బ్రతుకుతుందా ఏం? మళ్లా చూచిన తరువాత దుఃఖంతప్ప" అని సమర్థించి ఓ ఆవిడ.

"ఇంతకూ జబ్బేమిటో ఎవరూ చెప్పారు కాదు?" అంది అప్పుడేవచ్చి సమాజంలో కలిసి నామె.

"జబ్బేమీలేదుట. జబ్బెందు కమ్మాయి-అత్త మహాగయ్యాళిట. పాపం ఆ పోరుపడలేక ఏ నుయ్యో, లేకపోతే ఏ ఉరో పోసుకొనివుంటుంది. ఆ! ముక్కు మూసుకొంటే మూడుఘడియలు-వెధవప్రాణం" అంటూ చచ్చువేదాంతం బోధిస్తోంది జవసత్వాలుడిగిన ఒకామె.

ఈ విధంగా తర్కవితర్కాలతో కాలం గడిచిపోతోందిగాని ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి ఆలోచించడానికి ఎవ్వరికీబుర్రలుపనిచెయ్యలేదు.

ఇంతలో సత్యం కాలేజీనివచ్చాడు. తను వచ్చేసరికి ఇల్లంతా జనంతో నిండిపోయింది. మెల్లగా లోపల్నించి ఏడుపు వినిపిస్తోంది. తన కేమీ అర్థంగాక లోపలికివెళ్లాడు. తల్లి కొడుకును చూడగానే కావిలించుకొని "ఇంకా ఎక్కడి చెల్లెలు నాయనా!" అని ఏడుస్తోంది.

సత్యం ఆదుర్దాగా"ఏమిటి? ఏమయిందమ్మా" అన్నాడు తల్లిని. తండ్రిచేతులో ఉత్తరం కనిపిస్తోంది. తీసుకొని చదివి సావధానంగా చూచాడు "నువ్వేడవకమ్మా! ఇలా ఏడిస్తే ఏంప్రయోజనం? వెళ్ళి అసలు విషయం ఏమిటో తెలుసుకొస్తే పోతుందిగా! ఇప్పుడు పన్నెండయింది. ఇంకో అరగంటకి బెజవాడబండి వుంది. నువ్వు లే నాన్నా" అని తల్లిని ఓదార్చి లేవదీశాడు ప్రయాణానికి. తలుపు తాళంవేసి బయలుదేరి పోయేటప్పటికి సందు మలుపుతిరిగి అప్పుడే సైకిలు రిక్షా ఒకటి వస్తోంది. దాంట్లో జానకీ-జానకిభర్త రామారావూ వస్తున్నారు. జానకి నవ్వుతోంది తల్లివంక చూచి, సావిత్రమ్మ అట్లాగే శిలాప్రతిమలా కూతురివంక చూస్తూ నిలబడిపోయింది. ఒక్క సావిత్రేవిటి? అక్కణ్ణుంచున్న అందరి [illegible]

జానకికి ఇప్పటివరకూ జరిగిన తతంగమంతా తెలియదల్లే వుంది. "మామూలుగానే రిక్షాదిగి, మేమొస్తామని మీకెలా తెలుసు?" అంది తల్లినీ, తండ్రినీ. అన్నయ్యనీ. ఉద్దేశిస్తూ.

సావిత్రమ్మకు అప్పటికి నమ్మకం కలిగింది గాబోలు ఆ మాట్లాడేది నిజంగా జానకేనని గభాలున కావిలించుకొని "జానకీ! నువ్వేనా?" అంది జుట్టు సవరిస్తూను. సత్యం తలుపుతాళం తీశాడు. అందరూ లోపలికి వెళ్ళారు. ఇల్లంతా జనంతో నిండిపోవడం చూచి అల్లుడు సిగ్గుపడ్డాడు దశరథరామయ్య "ఈ వుత్తరం ఏమిటమ్మాయ్?" అన్నాడు కూతుర్నే!

జానకి నాలికకొరుక్కుని"ఇదా ఇంతచేసింది! దాంట్లోరాశానుకదమ్మా మీరేమీవిచారించవద్దని? వెధవ పీడకల వచ్చిందమ్మా—కీడుట! ఆ కీడు పోగొట్టడానికి ఎవరైనా వాళ్ళకోసం ఏడవాలిట. అంచేత అలా రాశాన్నేనే! ఇంత జరుగుతుందనుకోలేదు. అదీగాక ఎలాగూ వేణుపెళ్ళికి వద్దామనుకుంటున్నాంగా, ఈ వుత్తరం మీకందే సరికే రావచ్చుననుకున్నాం గాని, ప్రొద్దుటిబండి అందలేదు" అని పూర్తిచేసింది పెద్ద ఆముదం ముఖంవేసి. ఇరుగుపొరుగు వాళ్ళు వెళ్లిపోయాక "బాగా ఏడ్చారటే?"అని అడిగింది తల్లిని జానకి?

"మీ నాన్నగారు కడుపు తరుక్కుపోయేట్టు ఏడ్చారు" అంది సావిత్రమ్మ.

ఇదేప్రశ్న తండ్రిని వేసినప్పుడు "మీ అమ్మ నీకోసం ఎంత ఏడ్చిందనీ! అంత అర్థాంతరంగా ఉత్తరాలు రాయకూడదమ్మా!" అన్నాడు దశరథరామయ్య స్థిమితంగా నిట్టూరుస్తూ.

భార్యను పిలిచి "త్వరగా బట్ట సర్దుకోమరి. సాయంత్రమే బయలుదేరాలి"అన్నాడు.

"నే రాన్లెండి"అంది సావిత్రమ్మ.

"నీమొఖంలే! అల్లుడూ వాళ్ళూ ఏమనుకుంటారు ఇలా పోట్లాడుకొంటే! చీరకావాలన్నావుగా? బజారెళ్ళి పనిమనిషితో పంపుతాను. పదికావాలో తీసుకొని తిప్పి మిగిలినవి పంపెయ్" అన్నాడు. చావు కబురుతెచ్చిన వుత్తరాన్ని ఇద్దరూ తిట్టుకున్నారుగాని- ఇద్దరిమధ్యా అంత సామరస్యాన్నీ, అంత ఆత్మీయతనీ కలిగించడానికి [illegible]